విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

సోమవారం 28, ఏప్రిల్ 2025 8 పేజీలు



పెహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో

తిరుమలలో హై అలెర్ట్

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో జన సమ్మర్ధ ప్రాంతాలలో తిరుమల అంతటా ఏకకాలంలో క్షుణ్ణంగా తనిఖీలు ఆయా పోలీసులతో పాటు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక బృందాలచే చెకింగులు ఆర్టీసీ బస్టాండ్లు, తదితర జన సమ్మర్ధ ప్రాంతాలతో పాటు మఠాలు, హోటళ్లలో సోదాలు.వాహనాల తనిఖీలు నిర్వహించారు.బస్సులు, కార్లు గట్టి నిఘా మరియు శ్రీవారి మెట్టు, అలిపిరి నడక దారులలో గట్టి నిఘా ఉంచి, అనుమానితుల లగేజీ లు తనికి చేశారు. పెహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు జిల్లాలో హై అలెర్ట్ ప్రకటించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో జన సమ్మర్ధ ప్రాంతాలలో అనుమానితులు, వారి లగేజీలను మరియు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, ముఖ్య రహదారులు ఆయా పోలీసులతో పాటు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక పోలీసు బృందాలచే చెకింగులు చేశారు. తిరుమల అంతటా ఏక కాలంలో తనిఖీలు కొనసాగించారు.

కలెక్టరేట్‌కు శాశ్వత భవనం ఎప్పుడో

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి బాలాజీ జిల్లాకు కలెక్టర్ కార్యాలయం తాత్కాలికంగా పద్మావతీ నిలయం లో కొనసాగుతుంది. శాశ్వత భవన వసతి సమకూరే వరకూ బాలాజీ జిల్లా కలెక్టరేట్ పద్మావతీ నిలయంలోనే కొనసాగుతుందని కలెక్టర్ కార్యాలయానికి సొంత భవనం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. జిల్లాల ఏర్పడి సంవత్సరాలు గడిచిన ఇంతవరకు స్థలాన్ని కూడా కేటాయిం చకపోవడం గమనార్హం. తిరుపతి జిల్లా పరిధిలో తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. సబ్ కలెక్టరేట్ గా గూడూరు వ్యవహరిస్తుండగా, రెవెన్యూ డివిజనల్ ఆఫీసులుగా తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట వ్యవహరిస్తున్నాయి. రెవిన్యూ డివిజన్ కేంద్రంగా వున్న తిరుపతిలో నిజానికి కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రభుత్వ భవనాలు గానీ, ప్రాంగణాలు గానీ అందుబాటులో లేవు. గత ప్రభుత్వం దీనికోసం తాత్కాలికంగా ప్రైవేటు లేదా వివిధ సంస్థల భవనాలను ఉపయోగించుకోవాలని, ఆలోగా శాశ్వత భవనాలు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నుంచీ మార్గదర్శకాలు ఇవ్వడంతో దానికనుగుణంగా అధికారులు మహిళా విశ్వ విద్యాలయం, అగ్రికల్చర్ యూనివర్శిటీ కాలేజీ భవనాలతో పాటు తిరుచానూరు సమీపంలోని టీటీడీకి చెందిన పద్మావతీ నిలయాన్ని కూడా పరిశీలించారు. ఈ మూడింటిలో పద్మావతీ నిలయం జాతీయ రహదారి పక్కన వుండడం, వాహనాల పార్కింగ్‌కు విశాలమైన ప్రాంగణం వుండడం, వివిధ శాఖల కార్యాలయాలకు అవసరమైనన్ని గదులు అందుబాటులో వుండడం వంటి కారణాలతో అప్పటి అధికార యంత్రాంగం దానివైపే మొగ్గు చూపారు. ఆ మేరకు పద్మావతీ నిలయం అనుకూలంగా వుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు పద్మావతీ నిలయాన్ని కలెక్టరేట్ కోసం లీజు ప్రాతిపదికన తాత్కాలికంగా కేటాయించాలంటూ టీటీడీకి సూచించింది. 2021-22 సంవత్సరంలో పద్మావతీ నిలయాన్ని టీటీడీ ప్రభుత్వానికి అప్పగించనున్నట్టు తెలుస్తుంది. శ్రీవారి, అమ్మవారి దర్శనార్థమై వచ్చే యాత్రికులకు బస కోసం ఉద్దేశించిన పద్మావతీ నిలయాన్ని ఏ ముహూర్తాన నిర్మించారో గానీ లక్ష్యం నెరవేరడం లేదు. నిర్మా ణం పూర్తయ్యాక ప్రారంభోత్స వానికి ముహూర్తం కుదరలేదు. ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వచ్చింది. పర్యాటక శాఖకు లీజు ప్రాతిపదికన కేటాయించారు. ఆలోపు కరోనా వైరస్ సంక్షోభం సృష్టించడంతో కొవిడ్ బాధితులకు ఐసొలేషన్ కేంద్రంగా మారింది. మరో సందర్భంలో రాయలచెరువు కట్ట తెగిపోయే ప్రమాదం తలెత్తడంతో ఆ ప్రాంతవాసులకు పునరావాస కేంద్రంగానూ మారింది. ఇపుడు తాత్కాలిక కలెక్టరేట్ గా మారి సేవలందిస్తుంది. శాశ్వత భవనాల నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో అంతుబట్టని పరిస్థితుల్లో ఎప్పటికి తిరిగి టీటీడీకి స్వాధీనమవుతుందో చెప్పలేని పరిస్థితి. కలెక్టర్ కార్యాలయ శాశ్వత భవనం కోసం ప్రభుత్వం ఎప్పటికి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

పచ్చికాపల్లంలో ఆక్రమణలు

- నిత్యం ట్రాఫిక్ సమస్యలు

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో రహదారిపై అక్రమ ఆక్రమణల వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోం దని స్థానికులు, వాహనచోదకులు వాపోతు న్నారు. ప్రధానంగా పల్లిపట్టు, కార్వేటిన గరం నుంచి, చిత్తూరు నుంచి వచ్చే వాహనాలు పచ్చికాపల్లం కూడలి మీ దుగానే వెళ్ళా ల్సివుంది. అలానే పచ్చికాపల్లం పరిధి లో సుమారు 60గ్రామాల ప్రజా నీకం వివిధ రకాల కొనుగో ళ్ళకు, అమ్మకాలకు ఇక్క డికి వస్తుంటారు. దీంతో రో డ్లు రద్దీగా ఉంటాయి. రోడ్డు కిరువైపుల రహదారిపైకి ఆక్రమణలు చెయ్యడం వల్ల రోడ్డు ఇరుకైన పరిస్థితులు నెలకొన్నాయి. కొనుగోలు దారులు విధిలేని పరిస్థితిలో రోడ్లపై వాహనాలు పార్కి ంగ్ చెయ్యడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఒక్కోసారి అత్యవసర వాహనాలు సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కున్న సందర్భాలు కోకొల్లలు. అక్రమ ఆక్రమణలు జరుగు తున్న స్థానిక పంచాయతీ, ఆర్ అండ్‌బి అధికారులు చూసిచూడ నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. మండల, జిల్లా స్థాయి అధికారులు సైతం ఇదే కూడలి వైపు వెళుతున్నా పట్టించుకోవడం లేదని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పచ్చికాపల్లం రహదారిపై ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

1 నుండి పరిశీలనాత్మకంగా వీఐపీ బ్రేకు దర్శనాల్లో మార్పు

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: వేసవి సెలవుల రద్దీ నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపి లకు మాత్రమే మే 01 నుండి జూలై 15 వరకు బ్రేక్ దర్శనాలు పరిమితం (టిటిడి కీలక నిర్ణయాలు) శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం టిటిడి మే 01 తారీకు నుండి పలు కీలక నిర్ణయాలు అమలు చేయనుంది. వేసవి సెలవుల నేపథ్యంలో ఇప్పటికే తిరుమలకు భక్తుల రద్దీ పెరిగింది.

ఈ నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించడంలో భాగంగా మే 01 తారీకు నుండి జూలై 15 వ తారీకు వరకు, వీఐపీ బ్రేక్ దర్శనాలు కేవలం స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే టీటీడీ పరిమితం చేయనుంది.

అదేవిధంగా మే 01 తారీకు నుండి స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపిలకు వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రయోగాత్మకంగా ఉదయం 6 గంటల నుండి అమలు చేయనుంది.

ఆరుగురు పోలీసులు బదిలీ

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పోలీస్ స్టేషన్ లో గత ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఆరు మంది పోలీసులు బదిలీలో భాగంగా బదిలీపై వెళ్లారు. ఆదివారం స్టేషన్‌లో ఎస్సై విశ్వనాథ్ నాయుడు వారికి శాలువాలతో ఘనంగా సత్కరించి సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్ పనిచేసిన సిబ్బంది ఎంతో సహకారం అందించారు ప్రభాకర్, అరుణ్ కుమార్, శరత్ కుమార్, మోహన రంగా, రేగన్, నరేష్ లు శాంతి భద్రతలు చేపట్టడంలో సమాజంలో ఉద్యోగ బాధ్యతలో ఎంతగానో శ్రమించారన్నారు, స్టేషన్ పరిధిలో వారు చేసిన సేవలు మరువలేమన్నారు.

టిడిపి కార్యకర్తలకు పులివర్తి నాని నివాళి

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలంలో మృతి చెందిన టిడిపి కార్యకర్తలకు చంద్రగిరి శాసన సభ్యులు పులివర్తి నాని నివాళు లర్పించారు. పంటపల్లి గ్రామ పంచాయతీ కుందేటి వారి పల్లికి చెందిన మునిరత్నం నాయుడు, మొగరాల గ్రామ పంచాయతీ కృష్ణాపురానికి చెందిన వెంకటయ్య శనివారం మృతి చెందారు. వారుమృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదివారం మునిరత్నం నాయుడు, వెంకటయ్య పార్థివదేహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని వారి కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నాగరాజు నాయుడు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండలు దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-పుత్తూరు: వేసవి ఉష్ణోగ్రతలు అధికమవుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రవిరాజు, ఎం. నిశిదా రాజు, కోనేటి రవిరాజు పిలుపునిచ్చారు. అఖిల భారతీయ క్షత్రియ మహాసభ వారిచే జరిగిన అవగాహన కార్యక్రమంలో పుత్తూరు ప్రజలకు చల్లని ఐస్ క్రీమ్స్ 300 మందికి వితరణ చేసారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు లూజుగా ఉన్న వస్త్రాలు దరించాలి, తప్పనిసరిగా బయట వెళ్లాలంటీ గొడుగు గాని టోపీ వాడుతు, ద్రవ పదార్థాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, జ్యూసులు, నీళ్లు బాగా తీసుకొంటే వడదెబ్బ తగలకుండా నివారించ వచ్చాన్నారు. క్షత్రియ మహా సభ ఆంధ్రప్రదేశ్, అధ్యక్షులు చంద్రశేఖర్ రాజు, జనరల్ సెక్రటరీ కోనేటిరవిరాజు, యూత్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం రాజు, తిరుపతి జిల్లా సెక్రటరీ కె. రవీంద్ర వర్మ, ట్రెషర ర్ ప్రసాద్ వర్మ మరియు మెంబెర్స్ రామ్మోహన్ వర్మ, హరి పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీలకు సభ్యత్వ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర-పుత్తూరు: నగరి నియోజకవర్గ ఎంమ్మెల్యే శ్రీ గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు మున్సిపాలిటీ 55వ బూత్ మహమ్మద్ వీధి నందు ముస్లిమ్ మైనారిటీలకు టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ జరిగినది. ఈ కార్యక్రమంలో 9వ వార్డ్ పార్టీ అధ్యక్షులు పిఎస్ రాజా, గేట్ పుత్తూరు మసీదు మస్జిద్ ఏ ముఖద్దస్ ముతవల్లి మహమ్మద్ గౌస్, పుత్తూరు పట్టణ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కే. షబ్దర్, నగరి నియోజకవర్గం టిడిపి తెలుగు యువత ఆర్గనైజ్ సెక్రెటరీ ఎస్ హామీద్ బాషా, జాబీర్ పట్టణ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మోహన, యూనిస్, షకీల్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కిజర్ అక్రమ్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

విశాలాంధ్ర-పలమనేరు: పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు రజాక్ కుమారుడు కిజర్ అక్రమ్ మృతికి పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి తన సంతాపాన్ని తెలియజేశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కిజర్ అక్రమ్ ఆదివారం మృతి చెందాడు.

శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ జాతర మహోత్సవ పోస్టర్లు విడుదల

విశాలాంధ్ర-నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేటలో మే నెల 5, 6, 7 తేదీల్లో శ్రీ పోలేరమ్మ జాతర మహోత్సవ ఆహ్వానము పోస్టర్లు విడుదల చేసిన సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ. నాయుడుపేట పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన నాయుడుపేట గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ జాతర మహోత్సవ ఆహ్వాన పోస్టర్లు ను సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, మాజీ పార్లమెంట్ సభ్యులు, టీటీడీ బోర్డు మెంబర్, నెలవల సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటగిరి, కనుపూరు ను తలపించే విధంగా ఎన్నో ఏండ్లుగా నాయుడుపేట పట్టణంలో గడియారం సెంటర్ వద్ద గల గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరగటం ఆనవాయితీ అని వారు తెలిపారు. కుల మతాలకు అతీతంగా జాతర మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తమ కోర్కెలను కోరుకొని మొక్కులు తీర్చడం ఆనవాయితీ అన్నారు. ప్రతి ఏటా లాగా ఈ మే నెలలో 5, 6, 7 తేదీలలో జాతర మహోత్సవం చేయుటకు కమిటీ నిర్ణయం ప్రకారం దేవదాయ ధర్మదాయ శాఖ వారి ఆధ్వర్యంలో జరుగునని వారు తెలిపారు. ఈ యొక్క మహోత్సవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృప కటాక్షములు పొందగలరని తెలియజేశారు. అమ్మవారి చల్లని దయతో సూళ్లూరుపేట నియోజకవర్గం మొట్టమొదటి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆమె చల్లని దీవెనలతో నేను కావటం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ నేలవల విజయశ్రీ అన్నారు.

బోయకొండ గంగమ్మ గుడికి మోటార్, పైపులు విరాళం

విశాలాంధ్ర-చౌడేపల్లి: చౌడేపల్లి మండలము, దిగువపల్లి గ్రామములో ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానమునకు ఆదివారం శ్రీ చిక్క కెంపన్న. ప్రకాష్, గజేంద్ర, మల్లికార్జున, రామగుండహల్లి, అత్తూరు పోస్టు, యాలాహంక హెూబ్లీ, బెంగళూరు వారు సుమారు రూ. 2.5 లక్షల విలువ గల బోరు మోటారు, బోరు పైపులు, కేబులు, స్టాటర్ మొదలగునవి శ్రీ అమ్మవారికి కానుకగా సమర్పించియున్నారు. కొండ క్రింద ఇదివరకే వున్న బోరు నందు వారి స్వంత ఖర్చుతో సదరు వస్తువులతో బిగించడము జరిగినది. దేవస్థాన ఉప కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి. ఏకాంబరం వీరికి శ్రీ అమ్మవారి దర్శన భాగ్యము కలుగజేసి తీర్థ ప్రసాదములు అందజేసి సత్కరించినారు. ఈ కార్యక్రమములో దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దులయ్య గారి పల్లి గ్రామంలో మహాభారత యజ్ఞం

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం పూతలపట్టు మండలం వద్దులేయ్యగారి పల్లి గ్రామమునందు శ్రీ శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల వారి దేవాలయంలో 12 రోజులకు అంగరంగ వైభవంగా మహాభారతం జరుగు తున్నది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు అర్జునుని తపస్సు నిర్వహించబడినది. ఆలయ ధర్మకర్తలు ఇందులో భాగంగా మద్దులయ్యగారి పల్లి గ్రామంలో యుండు. దగ్గుపాటి మునికృష్ణ నాయుడు వారి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతి వాస్తవ్యులు ముని లక్ష్మీ భాగవత తారని చే మహాభారత హరికథ కాలక్షేపం ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఐదు గంటల వరకు హరికథ భక్తులకు ఇంపుగా చెప్పబడుచున్నది. రాత్రి నాటకము 21వ తేదీ నుండి ఒకటే తేది వరకు ప్రతిరోజు రాత్రి 9 గంటలకు శ్రీ వెంకటేశ్వర నాటక మండలి మేనేజర్ మేనేజర్ కే కిరణ్ కుమార్ వారిచే ప్రదర్శించుచున్నారు. ధర్మకర్తలో గ్రామస్తులు తెలిపారు.

మాధురి గోల్డ్‌లో కమ్మల మేళా

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణలలోని మాధురి గోల్డ్ జువెలరీ షాప్ ఆధ్వర్యంలో కమ్మల మేళాను ఘనంగా ప్రారంభించారు. బేరి వారి కళ్యాణ మండపంలో ఆదివారం ఈ మేళా జరిగింది. దీనికి పట్టణ ప్రముఖులు మాధురి గోల్డ్ ఖాతాదారులు పెద్ద ఎత్తున విచ్చేసి అభినందనలు తెలిపారు. ఆ సంస్థ యజమాని సుభాష్ మాట్లాడుతూ అక్షయ తృతీయ సందర్భంగా మాధురి గోల్డ్ ఈ గోల్డ్ మేళాలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ కమ్మలు మేళాలో భారీ ఆఫర్లు ప్రకటించామన్నారు. 916 కేడియం డైమండ్ కమ్మలపై ప్రత్యేకమైన డిస్కౌంట్ లను ఇస్తున్నట్లుగా వారు ప్రకటించారు.

వెంకటగిరిలో ఉచిత సంతాన సాఫల్య కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరిలోని పాత బస్టాండ్ సెంటర్లో ఉన్న గోపాల్ హాస్పిటల్ నందు నెల్లూరుకు చెందిన వాచ్యువల్ ట్రో ఐవిఎఫ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఉచితంగా దంపతులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తామని, గత 25 సంవత్సరాలుగా ఎంతో అనుభవం కలిగిన విజయవాడ నెల్లూరుకు చెందిన డాక్టర్లచే చాలా తక్కువ ఖర్చుతో ఐవీఎఫ్ ద్వారా దంపతులకు సంతానాన్ని కలిగిస్తామని వైద్యులు తెలిపారు. ముఖ్య అతిథులుగా సీఐ వెంకటరమణా మాట్లాడుతూ వెంకటగిరిలో ఉచిత మెడికల్ క్యాంపు ద్వారా ఐవిఎఫ్ పద్ధతిలో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు సంతోషంగా ఉందన్నారు. ఓజిలి ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ప్రజల అదృష్టంగా భావించవచ్చునన్నారు.

కుడుముల గోపాల్ కుటుంబానికి ఓదార్పు

విశాలాంధ్ర-చిల్లకూరు: తిరుపతి జిల్లా, గూడూరు నియోజక వర్గం పరిధిలోని చిల్లకూరు మండలం తిమ్మనగారిపాళెంలో ఇటీవల తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కుడుముల గోపాల్ మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలియడంతో రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు ధారు నాయక్ ఆదివారం తిమ్మనగారిపాళెం గ్రామానికి వచ్చి కుడముల గోపాల్ కుటుంబ సభ్యులకు ఓదార్పు పలికారు, పరామర్శించారు. ధైర్యం చెప్పి కుటుంబానికితెలుగుదేశం పార్టీ ఆండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మొగలి కల్లయ్య, జిసిసి డైరెక్టర్ లు రవి కుమార్, ఆవుల అరుణ, అధికా ప్రతినిధి కళావతి, పిరిగిల నవీన్, మనోహర్ నాయక్, తిరుపతి పార్లమెంట్ ఎస్టీ. సెల్ అధ్యక్షులు యం. సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు సవర్లు బంగారం అపహరణ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు రెండో పట్టణ పరిధిలోని చింపిరి నాయుడు కాలువ కట్ట దగ్గర ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. గూడూరు రూరల్ సీఐ శ్రీనివాస్ కథనం గూడూరు రెండో పట్టణ పరిధిలోని చింపిరి నాయుడు కాలువ కట్ట దగ్గర నాగమణి అనే మహిళా నివసిస్తున్నారన్నారు. ఆమె కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుందన్నారు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా బీరువా పగల కొట్టి, అందులోని వస్తువులు కింద పడిపోయి ఉండటంతో బీరువాలో ఉన్న 3 సవర్ల బంగారు నగలను అపహరించుకు పోయారన్నారు. వెంటనే పోలీసు లకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి గూడూరు డిఎస్పీ గీతా కుమారి, రెండో పట్టణ సిఐ శ్రీనివాస్ కలిసి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ వివరాలు సేకరించింది. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైరెడ్డిపల్లి గ్రామపంచాయతీ టిడిపి అధ్యక్షుని ఎన్నిక

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని పంచాయతీకి సంబంధించి తెలుగుదేశం పార్టీ పంచాయితీ అధ్యక్షుని ఎన్నిక ఆదివారం శేషాద్రి స్వామి గుడి ఆవరణలో ప్రతిష్టాత్మకంగా జరిగినది. ఈ ఎన్నికలో మొయిన్ ఉద్దీన్ పంచాయతీ అధ్యక్షునిగా సెక్రెటరీ శివకుమార్ కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగినది. మహిళా విభాగంలో అధ్యక్షురాలుగా టీ రెడ్డమ్మ సెక్రటరీగా కొమ్ము సుబ్బరత్న లను ఎన్నుకోవడం జరిగినది.మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ఎన్నిక ఒడిదుడుకులతో ఉంటుందని మండల కార్యకర్తలు భావించారు. కానీ కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో మండల నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కూర్చుని అందరి అభిప్రాయం మేరకు వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం శెట్టి అమర్నాథ్ రెడ్డి బైరెడ్డి అరుణ్ దామోదర్ రెడ్డి సాయి ప్రతాప్ రెడ్డి నాగరాజు రవిచంద్రగుప్త భువన చంద్ర గౌడ్ చౌక తల్లి ఉమామహేశ్వర్ రాజు సిద్దు సాదిక్ అస్గర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటు సారా తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రొంపిచెర్ల: నాటు సారా అతిగా తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన రొంపిచెర్ల-పీలేరు మండలాల సరిహద్దుల్లో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బండకింద పల్లి గ్రామపంచాయతీ లోని బడబల్ల వంక వద్ద రోడ్డు పక్కన సుమారు 45 సంవత్సరాల వయసు గల వ్యక్తి గా గుర్తించారు. ఆయన గత మూడు రోజులుగా కమ్మొళ్ళ పల్లె పక్కన ఉన్న రామానాయాక్ తాండా- ఎర్రగుంట్ల పల్లి మధ్య తిరుగుతున్నాడని గ్రామస్థులు తెలిపారు. పీలేరు మండలం రామానాయక్ తాండాలో నాటు సారు అతిగా తాగి మృతి చెంది ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అటుగా వెళ్తున్న బాటసారుల ఫిర్యాదుతో ఎస్ఐ సుబ్బారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం ఎడమ చేతి పై చున్నక్ రాజ్ అనే పచ్చ బొట్టుతో పేరు రాసుకున్నారని అన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆచూకి తెలిసిన వారు రొంపిచెర్ల పోలీసులు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సుబ్బారెడ్డి కోరారు.

హర్యానా రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్మికులను ఆదుకోవాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-చిత్తూరు: హర్యానా రాష్ట్రంలో వేకువ జమున విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్యం కార్మికులపై వాహనం దూసుకెళ్లడంతో అక్కడికక్కడే 6 మంది పారిశుద్ధ్య కార్మికులు మరణించారు వీరికి సంతాపం తెలియజేస్తూ చిత్తూరు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మౌనం పాటిస్తూ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్.నాగరాజు మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న పారిశుధ్యం కార్మికులపై వాహనం దూసుకో పోవడం కార్మికులు అక్కడికక్కడే రోడ్డు ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తూ వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ నాగరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నగర కార్యదర్శి దాసరి చంద్ర, యూనియన్ గౌరవ సలహాదారులు మణి, గోపీనాథ్, రమాదేవి, విజయ్ కుమార్, రఘు, లత తో పాటు యూనియన్ నాయకులు జయ శంకర్, సుగుణ, వినాయక, ఈశ్వర్, వినోద్, రంజిత్, గోవిందస్వామి, రామనాథం, సుకన్య, కస్తూరి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

నేరాలకట్టడికే కార్డన్ సెర్చ్

విశాలాంధ్ర-గూడూరు: నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్ అని గూడూరు డిఎస్పీ గీతా కుమారి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు రెండో పట్టణంలోని తిలక్ నగర్‌లో పోలీసు లు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ గీతా కుమారి మాట్లాడుతూ ప్రజలు అనుమానితులు కనపడితే పోలీసు లకు సమాచారం ఇవ్వాలి అన్నారు. సరైన పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. నేర రహిత సమాజం కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐలు సుబ్రమణ్యం రాజు, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కేటర్స్ నిరసన ర్యాలీ

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్, చిత్తూరు, తిరుపతి జిల్లాల రూరల్ స్కేటింగ్ అసోసియేషన్ సంయుక్తంగా పహల్గాం ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ స్కేటర్స్ తో నిరసన ర్యాలీ ఆదివారం ఉదయం నిర్వహించింది. ఈ ర్యాలీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఎన్జీఓ కాలనీలోని ఎస్ బిఐ నుంచి కపిలతీర్థం సర్కిల్ వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పర్యాటకులపై కాశ్మీర్ లో ఉగ్రవాదులు దాడి చేసి హత్య చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పేందుకు కఠిన చర్యలు తీసుకోంటోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా రోలర్ స్కేటింగ్ అసోషియేషన్ కార్యదర్శి మంత్రి పురుషోత్తం, కోశాధికారి హనుమాన్ బాబ్జి, కోచ్ లు పిఎల్ ప్రసాద్, రాజేష్, శశికిరణ్, జనసేన నాయకులు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులకు

కూలర్లు విరాళం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థలో పని చేస్తున్న సభ్యులకు ఆదివారం ఆ సంస్థ నిర్వాహకులు మునీర్ బాషా కూలర్లు వితరణ చేశారు. వేసవి నేపథ్యంలో ఈ కూలర్లను సంస్థ సభ్యులకు ఉచితంగా ఇస్తున్నట్లు మునీర్ బాషా ఈ సందర్భంగా చెప్పారు. కూలర్ల పంపిణీ కార్యక్రమానికి జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన హెల్పింగ్ హ్యాండ్స్ సేవలను కొనియాడారు. మునీర్ బాషానే ఆదర్శంగా తీసుకుని సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు కుమార్, మధు, చిరంజీవి, హెల్పింగ్ హాండ్స్

కాశ్మీర్ ఉగ్రవాద దాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర-తిరుపతి: కాశ్మీర్ పహల్గావ్ లో భారత టూరిస్ట్ లపై పైసాచికంగా దాడులు చేసి హతమార్చిన పాకిస్తాన్ తీవ్రవాదులపై భారత్ ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబించాలని కోరుతూ తిరుపతి ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది. తీవ్రవాదుల చేతిలో హతమైన భారతీయులకు జోహార్ అంటూ నివాళులర్పించింది. భారత ప్రభుత్వం ఇటువంటి దుశ్చర్యలపై ఉక్కు పాదంతో అణిచివేయాలని అందుకు భారతీయులంతా సంపూర్ణ మద్దతు తెలియజేస్తారని వక్తలు పిలుపునిచ్చారు. మున్సిపల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీనాథ్, కార్యదర్శి చంద్రకాంత్, గౌరవ అధ్యక్షులు వెంకటరెడ్డి, కేశవులు ఉడియార్, కోలా లక్ష్మీపతి, భక్తవత్సలం, టీ.దాసు, వెంకట ముని, ముని బాబు, గురునాథ్, మస్తాన్, రాజేశ్వరి, రఘునాథ బాబు, కొత్తపల్లి మునిరత్నం, బలరామిరెడ్డి, కొత్తపల్లి శంకరయ్య, వెంకట రమణ య్య శెట్టి, సుబ్బయ్య, భాస్కర్, సత్య మహేష్,వెంకటేష్, మధు పాల్గొన్నారు.

అమ్మవారికి అమావాస్య ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు సమీపంలో ఉన్న పరమేశ్వర మంగలం నగిరి మధ్యలో శ్రీ దక్షిణ కాళీ వారాహీ శక్తిపీఠంలో ఆదివారం చైర్మన్ మోహనమ్మ వారి ఆధ్వర్యంలో అమావాస్య పూజ లను హోమాలతో నిర్వహించి విశేషాలం కారంతో వారాహి మరియు కాళికాదేవి విశేషాలం కారంతో నిర్వహించి సుమారు 350 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహి చారు. ఇక్కడ వచ్చు భక్తులకు మధ్యాహ్నం అన్నదానము మరియు రాత్రి 8 గంటలకు మరియు అన్నదానాన్ని ప్రతి పౌర్ణమి అమావాస్యలకి నిర్వహిస్తున్నా మని, వారాహి ఆ అమ్మవారి అనుగ్రహం కోరిన కోరికలు కష్టాలు తీరడంతో భక్తులు వారి మొక్కులను తీర్చుకోవడానికి రావడం చాలా విశేషతరంగా ఉంటుంది అని టెంపుల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

మానవతా విలువలు నేర్చుకోండి: డాక్టర్ చంద్రప్ప

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: విద్యార్థులు బాల్యం నుంచే మానవతా విలువలు నేర్చు కోవాలని తిరుపతి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు, మానసిక వికాస నిపుణులు డాక్టర్ చంద్రప్ప చెప్పారు. శ్రీకాళహస్తి పట్టణం ముత్యా లమ్మగుడివీధిలో గల సత్య సాయి మందిరం లో విద్యార్థులకు ఉచితంగా వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ మందిరంలో ఆదివారం సత్య సాయిబాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు డాక్టర్ చంద్రప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు మానవతా విలువలు గురించి బోధించారు. సత్యసాయి బాబా ప్రధాన ఆశయాలైన సేవ, ప్రేమ, విద్యాదానం గురించి విద్యార్థులకు వివరించారు. బాబా అందించిన వైద్య సేవలు మరువలేని వన్నారు. కరువు సీమలో ప్రజల దాహార్తి తీర్చడానికి సత్యసాయిబాబా ఎంతో కృషి చేశారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, మానవతా విలువలతో ముందుకు వెళ్లాలన్నారు. పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు న్నారు. విద్యతో పేదరికం జయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయిబాబా చారిటీ ట్రస్ట్ నిర్వాహకులు పాండు రంగయ్య, వాసు దేవరావు, చెంగయ్య, నాగభూషణం, మల్లీశ్వరి, ప్రేమ కుమారి, విద్యార్థులు, సత్య సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

అంకాలమ్మ ఆలయంలో అన్నదానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం పీవీ రోడ్డులో వెలసిన అంకా లమ్మ ఆలయంలో ఆదివా రం అమావాస్యను పురస్క రించుకుని భక్తులకు అన్న దానం చేశారు. మరోపీపా ళెం వాస్తవ్యులైన యశ్వంత్ రావు, బాలాజీ రావు, జయ గణేష్, రాజశేఖరరావు ఈ అన్నదానం చేశారు. ఈ అన్నదానానికి పలువురు దాతలు విరాళం అందించారు. వీరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియచేశారు.

ఎస్వీ యూనివర్సిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ కడుపు కొడుతున్న కాంట్రాక్టర్

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ సమావేశం 11 గంటలకు గుణశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగినది. ఈ సమావేశానికి ఏఐటియుసి నగర అధ్యక్షులు కేవై రాజా ముఖ్యఅతిథిగా పాల్గొని వారి సమస్యలపై చర్చించడం జరిగింది.అనంతరం వారికి రావలసిన వేతనం 13 800 అయితే ఈ ఎస్ ఐ పి ఎఫ్ కటింగ్ పోను రూ.12,000 వారి అకౌంట్ కి జమ చేయవలసి ఉంది. అలా చేయకుండా కేవలం 10000 రూపాయలు మాత్రమే వారి అకౌంట్ కి జమచేసి పనిచేస్తున్న 130 మంది వర్కర్ల ఒక్కొక్కరికి చొప్పున 1500 రూపాయలు కటింగ్ చేస్తున్నారు. ఇది ఏమిటి అని అడిగితే కాంట్రాక్టర్ వద్ద నుండి సమాధానం రావడం లేదు.కనుక యూనివర్సిటీ అధికారులు ఈ విషయంపై కాంట్రాక్టర్ తో మాట్లాడి న్యాయమైన వేతనం వర్కర్లకు ఇవ్వాలని లేని పక్షంలో ఏఐటియూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు.కాలక్రమమైన గతంలో కూడా వర్కర్లకు అన్యాయం చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేసి వర్కర్లకు న్యాయం చేసే విధంగా చేయడం జరిగింది.కాబట్టి ఇప్పటికైనా కాంట్రాక్టర్ పద్ధతి మార్చుకోవాలని లేనియెడల సోమవారం యూనివర్సిటీ అధికారులకు వినతి పత్రం ఇచ్చి వర్కర్లకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని తెలియజేయడం జరుగుతుంది. వర్కర్ల సమస్య పరిష్కారం కాకపోతే ఏఐటియుసి ఆధ్వర్యంలో అదే రోజున ధర్నా కార్యక్రమం కూడా చేపడతామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో హాస్టల్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, సుధాకర్ వర్కర్స్ దేశమ్మ, నాగభూషణమ్మ, వనిత, నాగభూషణం, చిన్ని, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలమనేరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.. చిత్తూరులో రద్దు

విశాలాంధ్ర-చిత్తూరు: పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు మందిరం నందు సోమవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలమనేరు రెవిన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల కొరకు ప్రత్యేకంగా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. పలమనేరు రెవిన్యూ డివిజన్ పరిధి లో ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నందున జిల్లా కేంద్రమైన చిత్తూరులో జరుగు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లుఈ విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

దొంగలపట్ల అప్రమత్తం

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పరశురాముడు దొంగలతో జాగ్రత్తగా ఉండాలని ఒక ప్రెస్ నోట్ ను విడుదల చేశారు. పైన తెలిపిన ఫోటోలో ఉన్నవారు దొంగలని వీరు గ్రామాలలో సంచరిస్తూ, తాళాలు వేసిన ఇళ్ళను గుర్తించి, తాళాలు పగలగొట్టి దొంగతనాలు చేస్తారని, అద్దెకు ఇల్లు కావాలని విచారిస్తూ తిరిగినట్లు తిరుగుతూ తాళాలు వేసిన పిల్లలు పగలగొట్టి దొంగతనాలు చేస్తారని ఇటువంటి కొత్త వారు ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే పోలీసు వారి నెంబరు 112/100 కు కాల్ చేయాలని తెలియజేశారు. వీరు అనేక విధాలుగా దొంగతనాలు చేస్తున్నారని జాతీయ రహదారులను ద్విచక్ర వాహనాలు కార్లలో తిరిగేవారిని కూడా టార్గెట్ చేస్తారని తెలుస్తున్నది, భార్యాభర్తలుగా నటిస్తూ ఏదో గొడవ పడుతున్నట్లు నటిస్తారని, వాహనాన్ని ఆపి ఏం జరుగుతున్నది అని అడిగే లోపల వారిపై మత్తుమందు చల్లి వారి వద్ద ఉన్న ఆభరణాలు డబ్బును తస్కరిస్తారని తెలియజేస్తున్నారు.

సర్పంచ్ భారతి తిమ్మారెడ్డికి ఘన సత్కారం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం గ్రామపంచాయతీ పరిధిలోని కాలూరు ముస్లిం పేటలో ఆదివారం 12వ వసంతపు ఖత్నా ఒడుగుల మహోత్సవాన్ని ఆదివారం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆహ్వానాన్ని స్వీకరించి మహోత్సవానికి హాజరైన చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, సి.మల్లవరం సర్పంచ్ మొక్కల భారతి తిమ్మారెడ్డిని నూరాన్ మసీదు, విలేజ్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆలీ అహ్మద్, ముతవల్లి ప్యారు, మస్తాన్, జాకీరు, సాహిల్, లాల్సా తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో నేడు ఉద్యోగ మేళా

విశాలాంధ్ర-చిత్తూరు: చిత్తూరులోని జిల్లా ఉపాధి కార్యాలయం నందు సోమవారం ఉద్యోగ మేళా నిర్వహించ బడుతుందని, ప్రఖ్యాత కంపెనీలను ఈ కార్యక్రమంలోపాల్గొంటున్నాయని జిల్లా ఉపాధి అధికారి పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా, ఐటిఐ ఇంటర్ మీడియట్, డిగ్రీ పూర్తి చేసి, వయసు 19 నుండి 35 సంవత్సరాల మధ్య ఉన్న ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికేట్లతో సోమవారం ఉదయం 10.00 గంటలకి జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించబడే, ఉద్యోగ మేళాకు హాజరుకావాలని, ఆసక్తిగల అభ్యర్థులు ఉద్యోగ మేళకు పాల్గొనాలని తెలిపారు.

బీపీఅగ్రహారం రోడ్డుకు మహర్దశ

- జోరుగా తారు రోడ్డు నిర్మాణ పనులు
- హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే బొజ్జల
- స్థానికుల నుంచి ప్రశంసల వెల్లువ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దశాబ్దాల కల నిజమైంది. బీపీఅగ్రహారం నుంచి శనగలమిట్ట వరకు ఉన్న రోడ్డుకు మహర్దశ పట్టింది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేరస్తూ ఈ మార్గంలో తారురోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని బీపీఅగ్రహారం నుంచి, ఇసుక దిబ్బ, ఏఎంపుత్తూరు బైపాస్ మీదుగా అరవకొత్తూరు, దొమ్మరిపాళెం, గుండేలిగుంట, శనగలమిట్ట మార్గం ఎన్నో సంవత్సరాలుగా గుంతలమయమై వాహనాలకే కాదు పాదచారులు వెళ్లడానికి కూడా కష్టంగా మారింది. తరచూ ప్రమాదాలు కూడా జరిగేవి. ఈ మార్గం గుండానే శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు మండలాల్లోని పలు గ్రామాలకు, నెల్లూరు జిల్లా వెంకటగిరికి కూడా ఈ మార్గం గుండానే వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. అటువంటి ఈ మార్గంలో రోడ్డు అనేక సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోక దుస్థితిలో కొట్టుమిట్టాడుతూ వస్తోంది. ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు దుస్థితి మాత్రం ఇలానే కొనసాగుతూ వచ్చింది. మాజీ మంత్రివర్యులు కీర్తిశేషులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన నాడు వేసిన తారురోడ్డు తప్ప అప్పటినుండి బీపీ అగ్రహారం రోడ్డు కు మోక్షం లభించలేదు దశాబ్దాల తర్వాత యట్టికేలకు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి తనయుడు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నేడు నెరవేర్చారు.ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఎన్నికలకు ముందు తర్వాత పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి బీపీ అగ్రహారం వాసులు రోడ్డు దుస్థితిపై మొరపెట్టుకున్నారు. ఈ మార్గాన్ని అభివృద్ధి పరచి రోడ్డు రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే గుంతలమిట్టలుగా మారిన సిమెంటు రోడ్డుపై తారు రోడ్డు నిర్మాణానికి నిధులు తీసుకురావడంలో సఫలీకృతులయ్యారు. ఆ మేరకు ఆర్అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లలతో బీపీఅగ్రహారం నుంచి శనగలమిట్ట వరకు సుమారు పదికిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సరవేగంగా సాగుతున్న ఈ పనులు ప్రస్తుతానికి బీపీఅగ్రహారం వీధి నుండి ఇసుక దిబ్బ దాదాపుగా పూర్తికావచ్చింది. ఇక ఇక్కడి నుంచి ఎఎంపుత్తూరు బైపాస్ మీదుగా అరవతకొత్తూరు, దొమ్మరపాళెం, గుండేలిగుంట మీదుగా శనగలమిట్ట వరకు ఈ పనులు సాగాల్సి ఉంది. జోరుగా సాగుతున్న ఈ పనులు త్వరలోనే పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ఒక నెల రోజుల్లో బీపీఅగ్రహారం నడివీధి గంగమ్మ ఆలయ జాతర వేడుక జరగనుంది. ఈ సమయంలోనే ఈ వీధిలో తారు రోడ్డు పనులు పూర్తికావడంతో ఇక్కడి ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం తారు రోడ్డు నిర్మాణంతో ఈ మార్గం రూపురేఖలు మార్చారని ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ తారు రోడ్డు నిర్మాణంపై స్థానికులు ఎమ్మెల్యేకు తమ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని తెలుగు గంగ గేటు నుండి డిగ్రీ కాలేజ్ మీదుగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇటీవలే తారు రోడ్డు నిర్మాణం చేపట్టి ఆ ప్రాంత వాసుల నుండి ప్రసంసలు అందుకున్న విషయం తెలిసిందే.

తిరుపతి శిల్పారామంలో పిల్లల కోసం ప్రత్యేక సమ్మర్ క్యాంప్

- ఏఓ బి.సుధాకర్

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా పిల్లల కోసం ప్రత్యేక సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనా అధికారి బి.సుధాకర్ తెలిపారు. ఆదివారం శిల్పారామంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమ్మర్ క్యాంప్లో పిల్లలకు శాస్త్రీయ నృత్యం,మట్టి కుండలు, మట్టి బొమ్మల తయారీ,డ్రాయింగ్ వంటి కళలపై శిక్షణ ఇవ్వబడుతుందని, 6 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థినీ,విద్యార్థులు అర్హులనీ ఈ శిక్షణ తరగతులు 01.05.2025 నుండి 31.05.2025 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అనుభవజ్ఞులు, నిష్ణాతులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వబడుతుందని శిల్పారామం పరిపాలనా అధికారి బి.సుధాకర్ తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్ పిల్లలలో సృజనాత్మకతను పెంచేందుకు, కళలపై ఆసక్తిని కలిగించేందుకు, వారి సామర్థ్యాలను మెరుగుపరచేందుకు ఒక మంచి అవకాశంగా నిలుస్తుందని, ఇది పిల్లలకు వినోదం మాత్రమే కాకుండా, వారి వ్యక్తిత్వ అభివృద్ధికీ దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ క్యాంప్కు సంబంధించిన మరిన్ని వివరాలు, నమోదు విధానం, ఫీజులు వంటి సమాచారం కోసం 8886652044, 8886652016 నంబర్ లను సంప్రదించగలరని ఏఓ బి.సుధాకర్ తెలిపారు.

వైసీపీలో నుండి టిడిపిలోకి జంప్

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని ఎనిమిదవ వార్డు మెంబరు రాము ఈయనతోపాటు రవి, శివ, నగేష్, సీనా తదితర దళిత నాయకులు టిడిపిలో చేరడం జరిగినది. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్నటువంటి వీరు గతంలో వైయస్సార్సీపీలో చురుగ్గా పాల్గొన్నారు. వైఎస్ఆర్సిపి సిద్ధాంతాలపై విరక్తి పొందిన వీరు టిడిపిలో చేరుతున్నట్లు తెలియజేశారు. మండల కేంద్రంలో దళితులైన వీరికి మంచి పట్టు ఉన్నది దీనివల్ల వైయస్సార్సీపీకి తీరని లోటు ఏర్పడినట్లు తెలుస్తుంది.

ఏఎస్ఐ శేఖర్ రెడ్డి సేవలు ఆదర్శనీయం: చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలంలోని రక్షక భట్టనిలయంలో అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్ఐ)గా విధులు నిర్వహించిన పి. శేఖర్ రెడ్డి పదవీవిరమణ సందర్భంగా ఆదివారం ఘన సత్కార కార్యక్రమం మండలంలోని మిట్టూరు కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చంద్రగిరి డీఎస్పీ బి.ప్రసాద్, సీఐ టి.సుబ్బరామిరెడ్డి హాజరై శేఖర్ రెడ్డి సేవలను ప్రశంసించారు. డీఎస్పీ మాట్లాడుతూ 38 ఏళ్ల సుదీర్ఘ సేవలో ఎలాంటి రిమార్క్ లేకుండా ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన శేఖర్ రెడ్డి పోలీస్ శాఖకు గౌరవంగా నిలిచారని కొనియాడారు. సీఐ టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ, హత్యలు, దొంగతనాలు, ఎర్రచందనం స్మగ్లింగ్ వంటి క్లిష్ట కేసులను తెలివితేటలతో ఛేదించిన వ్యక్తిత్వం శేఖర్ రెడ్డికి ప్రత్యేకత అని పేర్కొన్నారు.ఎస్సై రామాంజనేయులు మాట్లాడుతూ వయసు మీదైనా సేవల విషయంలో శేఖర్ రెడ్డి చూపిన నిష్పక్షపాతత, బాధ్యతాయుతమైన వైఖరి పోలీస్ విభాగానికి ఆదర్శమన్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు శేఖర్ రెడ్డి ప్రజలతో మమేకమై గ్రామీణ స్థాయిలో శాంతి భద్రతలను నిలుపుకోవడంలో ఆయిన పాత్రను గుర్తు చేశారు. టీడీపీ నాయకులు ఎం.తిరుమలరెడ్డి, చేకూరి జనార్దన్ చౌదరి శేఖర్ రెడ్డిని ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా కొనియాడారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి దంపతులకు దుశ్శాలువా, గజమాలలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యూనియన్ నాయకులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ పోలీస్ స్టేషన్లకు డిఎస్పీలను నియమించాలి

బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు చందు

విశాలాంధ్ర-చిత్తూరు: రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలకు సత్వర న్యాయం అందించేందుకు ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ లకు డిఎస్పి లను నియమించాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు చందు డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకొని డిఎస్పీలను నియమించనున్నారు. రాష్ట్రము లో దళితుల దాడులు పట్ల హోం మంత్రి, డిజిపి లకు చిత్తశుద్ధి లేదన్నారు. దీనిపై మే 5న చలో విజయవాడ మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024 సంవత్సరంలో గుట్టు చప్పుడు కాకుండా 98 మంది ఎస్సీ, ఎస్టీ స్పెషల్ పోలీస్ స్టేషన్ల డిఎస్పీ లను రాష్ట్రవ్యాప్తంగా పోస్టింగ్లను రద్దు చేసిందని ఆరోపించారు. ఈ స్పెషల్ డిఎస్పీల వ్యవస్థను ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని బలపరచడానికి, ఎస్సీ ఎస్టీ బాధితుల వర్గానికి మెరుగైన సత్వర న్యాయాన్ని అందించడానికి, పటిష్టంగా ఈ చట్టాన్ని అమలు చేయడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల ద్వారా 2014వ సంవత్సరంలో ఈ స్పెషల్ డిఎస్పీల వ్యవస్థనుఏర్పాటు చేశారని తెలిపారు. ఈ ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పి లను 2024లో పోస్టింగులు రద్దు చేసినప్పటికీ, కొత్త ప్రభుత్వం బాధ్యతలు తీసుకున్న తర్వాత ఈ విషయం తెలిసిన ఏమాత్రం సమస్య పరిష్కార దిశగా స్పందనలేదన్నారు. ఈ సమస్యను పరిష్కారం చేయకుండా, చట్టాన్ని నీరు కార్చేరకంగా ప్రభుత్వం వ్యవహరిస్తే తప్పకుండా తిరుగుబాటు ఉద్యమం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ సంఘాలను, ఇతర ప్రజాసంఘాలను, కలిసొచ్చే రాజకీయ పార్టీలను ఏకం చేసి విజయవాడ నడిబొడ్డున మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బహుజన సేన రాష్ట్ర కార్యదర్శి గోవిందప్ప, చిత్తూరు జిల్లా అధ్యక్షులు సతీష్, ఉపాధ్యక్షులు కుమార్, హరి వర్ధన్, బాలు, భాస్కర్ వీరితోపాటు బహుజనసేన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గ్రేడ్ -1 గ్రంథాలయంలో 28 నుంచి ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర-తిరుపతి: స్థానిక అన్నమయ్య సర్కిల్లోని గ్రేడ్ -1 గ్రంథాలయంలో వేసవి సెలవులు సందర్భంగా ప్రతి ఏడాది లానే ఈ సంవత్సరం కూడా హై స్కూలు విద్యార్థిని విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహిస్తున్నట్లు గ్రేడ్-1 గ్రంథాలయధికారి జె.శివ ప్రసాద్ తెలిపారు.ప్రతి రోజు ఉదయం 8 నుండి 11 గంటల వరకు ఈ ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు, ఈ శిబిరంలో వివిధ విషయాల్లో శిక్షణలు స్పోకెన్ ఇంగ్లీషు, ఇంగ్లీషు గ్రామర్, కథలు వినుట, పుస్తక పఠనము, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పుట, చిత్రలేఖనము,పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, ఆర్ట్ వంటి సృజనాత్మక అంశాలలో ఉచితముగా శిక్షణ ఇవ్వబడునని విద్యార్థులు తమ ప్రతిభను వెలికి తీసుకునే అవకాశం ఈ శిబిరం ద్వారా లభించనుందని కావున ఈ ఉచిత వేసవి శిక్షణా శిబిరంని హై స్కూలు విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జి కార్యదర్శి జె.శివ ప్రసాద్ పత్రికా ప్రకటన ద్వారా కోరారు. పిల్లలకు ఉచితముగా శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తిగల రిసోర్స్ పర్సన్స్ ఎవరైనావుంటే సెల్ నెంబర్ 9912189869 సంప్రదించవలసినదిగా కోరారు.

ఎస్వీయూ అంబులెన్స్‌కు మోక్షం.. విద్యార్థుల వినతికి వీసీ స్పందన

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) లో వాడకంలో లేకుండా నిలిపివేసిన అంబులెన్స్ ను చివరకు వినియోగం లోకి తీసుకొచ్చారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణలో కీలకంగా మారే ఈ వాహనం నిశ్శబ్దంగా ఉండటంపై ఇటీవల వర్శిటీలో విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ఎస్వీయూలో జీఎన్ఎస్ నాయకుడు శివ శంకర్ నాయక్ వైస్ చాన్సలర్ డా. అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు ఎమర్జెన్సీలో వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండాలన్నదే తమ కోరికగా ఆయన అన్నారు. వెంటనే స్పందించిన వీసీ, అంబులెన్స్‌కు అవసరమైన షెడ్ నిర్మాణానికి ఆదేశించి, వాహనాన్ని తిరిగి సేవలోకి తీసుకురావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీఎన్ఎస్ నాయకుడు శివ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఇది మంచి పరిణామం. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించిన వీసీకి కృతజ్ఞతలు తెలి పారు. ఎస్వీయూ క్యాంపస్‌లో ఇక పై ఆరోగ్య సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో అంబు లెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయని విశ్వవిద్యాలయ వర్గాలు తెలియజేశాయి.

మెడి ప్లస్ వారి ఆధ్వర్యంలో మేఘా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని ఆదివారం చైతన్య నర్సింగ్ హోమ్ వీధిలో గల మెడిప్లస్ వారి ఆధ్వర్యంలో మేఘా రక్తదాన శిబిరం జరిగినది. ఈ రక్తదాన శిబిరమునకు ముఖ్య అతిథులుగా నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నెలవల రాజేష్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ ఉయ్యాల ప్రవీణ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నానాబాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నక్షతో భూతగాదాలకు చెక్: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విశాలాంధ్ర-తిరుపతి: నక్ష పైలెట్ ప్రాజెక్ట్ కింద తిరుపతిలో డ్రోన్ సర్వే ను ఆదివారం ఉదయం వినాయకసాగర్ లో జెండా ఊపి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. డ్రోన్ సర్వే తీరును అధికారులు ఎమ్మెల్యేకి వివరించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్స్ రికార్డ్ మానిటరింగ్ ప్రోగ్రాం క్రింద కేంద్ర ప్రభుత్వం నక్ష ప్రాజెక్ట్ కింద తిరుపతిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది ప్రాంతాలు నక్ష ప్రాజెక్ట్ కు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. నక్ష ప్రాజెక్ట్ కింద జరగనున్న డ్రోన్ సర్వేతో ఆక్రమణలకు చెక్ పడుతుందని ఆయన తెలిపారు. దీంతో నగరంలోని చెరువులు, గుంటలు, కాలువల ఆక్రమణకు గురికాకుండా ఉంటాయని ఆయన చెప్పారు. దీంతో నీటి నిల్వలు పెరగడమే కాకుండా కాలుష్య నియంత్రణకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. రాష్ట్రంలో గత ఐదేళ్ళలో రీసర్వే పేరుతో భూతగాదాలు పెరిగిపోయాయని ఆయన చెప్పారు. రెవెన్యూ శాఖలో పారదర్శకత నక్ష ప్రాజెక్ట్ తో సాధ్యమౌతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. డ్రోన్ సర్వే విజయవంతానికి రెవెన్యూ, ప్లానింగ్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి కమిషనర్ అమరయ్య, ఏసిపి బాలాజీ, జనసేన నాయకులు మంత్రి పురుషోత్తం, మధులత, ఆదం సుధాకర్ రెడ్డి, కెఎంకే లోకేష్, పగడాల మురళీ, ఆముదాల వెంకటేష్, మునస్వామి, లోకేష్, వంశీ, ఆళ్వార్ మురళీ, వెంకటేష్ రాయల్, బాలాజీ, హేమంత్, టిడిపి నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, చిన్ని, నరేష్ తదితరలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి సంతకు విముక్తి

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలో ప్రతి శనివారం గొర్రెలు మేకలు కోళ్లు మరియు కూరగాయల సంత జరపడం ఆనవాఇతీ, గత కొన్ని సంవత్సరాలుగా పుంగనూరు బైరెడ్డిపల్లి రోడ్డు పక్కన నిర్వహించేవాళ్లు ఈ సంతకు విముక్తి కల్పిస్తూ మండల తెలుగుదేశం అధ్యక్షులు కిషోర్ గౌడ్ శేషాద్రి స్వామి గుడి సమీపంలో కూరగాయలు, చౌక దుకాణాలు హాలో నిర్వహించడం జరుగుతుంది. బైరెడ్డిపల్లి ఇండియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గొర్రెలు కోళ్ల సంత జరుపుతున్నట్లు తెలియజేశారు. ఈ సంత పది రోజుల తర్వాత ఈ ప్రదేశంలో ప్రారంభించనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. రోడ్డు పక్కన సంత నిర్వహించడం వల్ల వాహనాలలో ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందిగా ఉండేది ఇందుమూలంగా ప్రజలు మండల అధ్యక్షుడు కిషోర్ గౌడ్ తో వినియోగించుకోవడం జరిగినది. ఇందుమూలాన ఆయన సంత పై దృష్టి సారించి ఈ సంతను ఏర్పాటు చేయడం జరిగినట్లు ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

మే 2 నుండి వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఏ.సి.ఏ సబ్ సెంటర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం మే నెల రెండవ తేదీ నుండి ప్రారంభమవుతుందని ఆసక్తి గలవారు రెండవ తేదీ స్టేడియం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సబ్ సెంటర్ ఇన్చార్జ్ ముని గిరీష్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏ.సి.ఏ సబ్ సెంటర్ ఇన్చార్జ్ ముని గిరీష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం మే నెల రెండో తేదీ నుండి నెల రోజులపాటు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏడు సంవత్సరముల నుండి 16 సంవత్సరముల లోపు వారు పాల్గొనవచ్చని ఇక్కడ శిక్షణ పొంది జిల్లా రాష్ట్రస్థాయిలో ఎంతోమంది గుర్తింపు పొందారని అన్నారు. ఆసక్తిగల క్రికెట్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనిల్ ,లవ కుమార్ ,సురేందర్ రెడ్డి, నాగేశ్వరరావు, మహేష్, మస్తాన్, రజిని, సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో మద్యం వ్యసన విముక్తి కోసం అవగాహన కార్యక్రమాలు ఏవీ?

విశాలాంధ్ర-చంద్రగిరి: తిరుపతి జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కేర్ కార్యక్రమంలో మద్యం వ్యసన విముక్తి అవగాహన కార్యక్రమాలు చంద్రగిరి మండలం లో ఏవీ చేపట్టడం లేదు. మద్యం వ్యాపారస్తులు ఎక్సైజ్ శాఖకు బారీగా ముడుపులు ముట్ట చెప్పుతుండం కారణంగానే వారు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం సేవనపు దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యాచరణ ద్వారా జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ల ఇన్స్పెక్టర్ల సమన్వయంతో, గ్రామాల్లో పర్యటించి ర్యాలీ నిర్వహించి మద్యం మానేయాలనే సంకల్పం తీసుకునేలా ప్రజలను ప్రేరేపించాలి. మాదకద్రవ్యాల వ్యసన బాధితుల్లో అవగాహన పెంపొందించి, వారికీ మానసిక మద్దతును అందించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రజలతో నేరుగా మమేకమై మద్యం, మాదకద్రవ్యాల వ్యసనంపై, మానేయడంపై ప్రాముఖ్య తను వివరించాల్సి ఉంది. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత విస్తృతంగా చేపట్టితే సమాజం బాగుపడి నేరాలు తగ్గే అవకాశాలు ఉంటాయి.

ఫల సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్ట్ భరోసా కార్యక్రమంలో భాగంగా నిరుపేద రెడ్డి బంధువులకు నెలకు సరిపడా ఫల సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు దువ్వూరు విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గున్నం రెడ్డి మధుసూదన్ రెడ్డి దాతృత్వంతో ఇంత మంచి కార్యక్రమం జరుగుతుందని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్రజేంద్ర రెడ్డి మాట్లాడుతూ గుణం రెడ్డి మధుసూదన్ రెడ్డి, రాధమ్మల దయాగుణం, పర్యావరణం పట్ల వారికి శ్రద్ధ, విద్య వైద్యానికి అందించే సహాయం మరువ రావని, నిరుపేదలైన 25 మందికి ప్రతినెల పలసరుకులు అందించడం చాలా సంతోషించ తగ్గ విషయమని వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకట రామిరెడ్డి, హరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మొరవ మహాభారత ఉత్సవాలు

విశాలాంధ్ర-వెదురుకుప్పం: పది రోజులుగా జరుగుతున్న మండలంలోని మొరవ మహాభారతం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం దుర్యోదన వధ సన్నివేశం భక్తులను అలరించింది. సాయంత్రం ద్రౌపతీ సమేత ధర్మరాజుల ఆలయంలో కంకణాలు ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు మోహన్ రెడ్డి,తారక్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక ఎస్సై వెంకటసుబ్బయ్య పోలీసు సిబ్బంది తో బందోబస్తు నిర్వహించారు.

ఉగ్రదాడిపై "మానవత" ఆగ్రహం

- పర్యాటకుల మృతికి ఘన నివాళి

- మతోన్మాద పాక్ ముష్కరులు మూల్యం చెల్లించక తప్పదు

విశాలాంధ్ర- తిరుపతి : కాశ్మీర్ లోని పహల్గాంలో మతోన్మాద పాక్ ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా దాడి చేసి కాల్చి చంపిన పాక్ ముష్కరులు మూల్యం చెల్లించక తప్పదని తిరుపతి మానవత శాఖ తీవ్రంగా హెచ్చరించి, ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం ఉదయం తిరుపతిలోని రుద్రరాజు సంపూర్ణమ్మ గార్డెన్స్ లో జరిగిన సమావేశంలో మానవతా సభ్యులు ముష్కరుల దాడిలో మృతి చెందిన హిందూ బంధువులకు మౌనం పాటించి, ఘన నివాళి అర్పించారు. కాశ్మీర్ ఘటనను మతోన్మాద దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఓంకారంతో పుష్పాంజలి ఘటించి భారత్ మాతాకీ జై, వందేమాతరం, జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. పాక్ ఉగ్రవాద ముష్కరులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందూ దేశంలో పాక ఉగ్రవాదులను ఏరి పారేయాలి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భగవంతుని ప్రార్థించారు. అనంతరం మానవతా నెలవారి సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మానవతా సెంట్రల్ కమిటీ డైరెక్టర్ ఎన్వి కృష్ణారెడ్డి, చైర్మన్ కోన భార్గవ, కో చైర్మన్ రాళ్లపల్లి మాధవ నాయుడు, అధ్యక్షులు ఎన్వి రమణ, కార్యదర్శి సుకుమార్ రాజు, కోశాధికారి భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు వేణుగోపాల్, పద్మనాభం, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, సిరిగిరి శంకర్ రాజు, గురు ప్రసాద్, రిటైర్డ్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య, సాయి కృష్ణమరాజు, సుందర కుమార్ రాజు, కోనేటి రవి రాజు,బాలాజీ నాయుడు, మాధవ రాజు, నరసింహులు, మార్కండేయ రెడ్డి, రామస్వామి, సాయి రెడ్డి, నిరంజన్ నాయుడు, లోక్ సింగ్, షణ్ముగం, రమణయ్య, సుధాకర్ బాబు, నీరజ,భార్గవి, నవీన్, ప్రవీణ్, లోకేష్, సుధాకర్ అధిక సంఖ్యలో మానవతామూర్తులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 29న కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

విశాలాంధ్ర- తిరుపతి : చిత్తూరు జిల్లా కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో ఏప్రిల్ 29న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయంలో మే 5 నుండి 13వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఉదయం 8 నుండి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 11 గంటల నుండి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. ఆలయ చరిత్ర :చిత్తూరు జిల్లా గంగవరం (మం) కీలపట్ల గ్రామంలో వెలసిన శ్రీ కోనేటిరాయ స్వామి దేవాలయం అతి పురాతనమైన చారిత్రక ప్రసిద్ధి కలిగిన దేవాలయం. ఈ స్వామి వారిని భృగు మహర్షి ప్రతిష్ఠ చేసి ఆరాధించగా, పాండవ మధ్యముడు అర్జునుడి ముని మనవడు జనమేజయ మహారాజు గుడి కట్టించారు. తర్వాత కాలంలో చోళ, పల్లవ, విజయనగర సామ్రాజ్యాధీశుల ఏలుబడిలో విశేష పూజలు అందుకుని తర్వాత మహమ్మదీయుల దండయాత్రలకు భయపడి గ్రామస్తులు స్వామి వారిని కోనేటిలో దాచి ఉంచారు. ఆ తర్వాత కాలంలో చంద్రగిరి సంస్థానాధీశుల సామంతులు శ్రీ బోడికొండమ నాయుడు గారికి కలలో సాక్షాత్కరించి కోనేటిలో ఉన్న స్వామివారిని తిరిగి ప్రతిష్ఠించమని కోరినారు. ఆ విధంగా కోనేటి నుండి ప్రతిష్ఠ చేయబడి శ్రీ కోనేటి రాయ స్వామిగా ప్రసిద్ధి చెందినారు. అన్నమయ్య కీర్తనలలో శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయం ఈ గ్రామంలో మాత్రమే ఉన్నది. కోరినదే తడవుగా కొండంత వరములను ప్రసాదించే శ్రీ కోనేటిరాయ స్వామి వారికి తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా శ్రీ వైఖానస ఆగమోక్త ప్రకారముగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

అంగరంగ వైభవంగా సిటీ ఛాంబర్ ఉగాది పురస్కారాలు

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతి సిటీ ఛాంబర్ ఆధ్వర్యంలో 1220వ కార్యక్రమం "ఉగాది పురస్కార కార్యక్రమం" స్థానిక మహతి ఆడిటోరియంలో కన్నుల పండుగగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, ఎం.ఎల్.సి. డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, యాదవ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసా రత్నం, దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, తిరుపతి మాజీ శాసనసభ సభ్యులు మోహన్, సుగుణమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ న్యాయ కళాశాల చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి కి, సమాజ సేవకులు, సీనియర్ రాజకీయ నాయకులు మందలపు మోహనరావు గారికి జీవిత సాఫల్య పురస్కారం, చార్టర్డ్ అకౌంటెంట్ ఎం.ఆర్.ఎస్. శ్రీనివాస్, తిరుపతి కార్పొరేటర్ అన్నా అనితా యాదవ్, డాక్టర్ సి. అర్చన, ఎల్.వెంకటరమణ, డాక్టర్ పి.గోపాల్, సాంబోలు హరనాథ్ మరియు శ్రీమతి ఎస్.సరళ గార్లకు ఉగాది పురస్కారం, కుమారి ఈ.పద్మజకు ప్రత్యేక గౌరవ పురస్కారం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా తిరుపతి స్థానిక శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సిటీ ఛాంబర్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు స్వచ్ఛంద సంస్థలకు ఆదర్శమని కొనియాడారు. సంస్థను స్థాపించిన నాటి నుండి నేటి వరకు సుమారు 1220 కార్యక్రమాలు నిర్వహించిన సిటీ ఛాంబర్ వ్యవస్థాపకులు ఆయుబుఖాన్ మరియు షణ్ముగం యాదవ్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఢిల్లీ నుండి గల్లీ వరకు వివిధ రంగాలలో విశిష్ట సేవలు చేసిన వారిని గుర్తించి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా గత 28 సంవత్సరాలుగా ఉగాది పురస్కారాలు అందిస్తున్న తిరుపతి సిటీ ఛాంబర్ సేవా కార్యక్రమాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు. సన్మానం అందుకున్న వారందరినీ అభినందిస్తూ, సిటీ ఛాంబర్‌కు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు.ఎం.ఎల్.సి. డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా సిటీ ఛాంబర్ వారి ప్రతి కార్యక్రమంలో తాను పాల్గొన్నానని గుర్తు చేశారు. ఒక వైద్యునిగా సుమారు 400 పైగా వైద్య శిబిరాలను సిటీ ఛాంబర్ ఆధ్వర్యంలో నిర్వహించానని చెప్పారు. సిటీ ఛాంబర్ ఉగాది పురస్కారానికి జాతీయ స్థాయిలో ఒక గుర్తింపు ఉందని, వారి భవిష్యత్ కార్యక్రమాలలో కూడా ఒక సభ్యునిగా పాల్గొంటానని తెలియజేశారు.యాదవ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ తిరుపతి సిటీ ఛాంబర్ వారు జాతీయ స్థాయిలోని మహానుభావులను గుర్తించి వారిని తిరుపతికి ఆహ్వానించి ఉగాది పురస్కారం అందజేసినందుకు తిరుపతి వాసిగా సిటీ ఛాంబర్‌కు తాను రుణపడి ఉన్నానని అన్నారు.మాజీ మంత్రి పరసా రత్నం గారు, మాజీ శాసనసభ్యులు మోహన్, సుగుణమ్మ, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యులు పోకల అశోక్ కుమార్ గారు మాట్లాడుతూ ఉగాది పురస్కార గ్రహీతలను తిరుపతి సిటీ ఛాంబర్ వారు ఎంచుకున్న విధానం గతంలో ఎన్నడూ లేని విధంగానూ, భవిష్యత్తులోనూ ఉండబోదని ప్రశంసించారు. ఇటువంటి సన్మాన గ్రహీతలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు.అనంతరం సిటీ ఛాంబర్ అధ్యక్ష కార్యదర్శులు ఆయుబుఖాన్, షణ్ముగం యాదవ్, కార్యక్రమ చైర్మన్ కె.ఎస్.వాసు అవార్డు గ్రహీతలను సభకు పరిచయం చేసి వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సిటీ ఛాంబర్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్, డాక్టర్ కరుణానిధి, పి.సి.స్వామి, స్వరాజ్య లక్ష్మీ, వేణు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి

- గూడూరు రెండో పట్టణ సిఐ శ్రీనివాస్

విశాలాంధ్ర-గూడూరు: వేసవి కాలం దృష్ట్యా దొంగతనాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గూడూరు రెండో పట్టణ సిఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ముందు బయట బైక్ ఉంచేటప్పుడు తప్పనిసరిగా లాక్ చేయాలని సూచించారు. గూడూరు రైల్వే స్టేషన్ 5వ ప్లాట్‌ఫాం వద్ద కాకుండా, 1వ ప్లాట్‌ఫాం వద్ద కేటాయించిన బైక్ పార్కింగ్ ప్రదేశాన్ని మాత్రమే వినియోగించాలన్నారు. పార్కింగ్ లేని ప్రదేశాల్లో వాహనాలు ఉంచకూడదు అని సూచించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంటిలో నగదు, బంగారం వదిలి పెట్టకుండా సురక్షితంగా భద్రపరచండి. ఇల్లు ఖాళీగా వదిలేటప్పుడు పక్కవారికి సమాచారం ఇవ్వండి బలమైన తాళాలు ఉపయోగించాలన్నారు.ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినప్పుడు వెంటనే గూడూరు రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వి.కోట పూర్వ పంచాయతీ కార్యదర్శి పై వేటు

విశాలాంధ్ర- చిత్తూరు: వి.కోట పంచాయతీలో నిధులు దుర్వినియోగానికి పాల్పడినందుకు పూర్వ కార్యదర్శి ప్రస్తుతం బైరాల మండలం పాలకల్లో పనిచేస్తున్న యాదవపతిని సస్పెండ్ చేసినట్లు డిపిఒ సుధాకర్ తెలిపారు. వీకోట పంచాయతీ లో భారీగా నిధులు దుర్వినియోగం అయ్యాయని, అలాగే ప్రజలు చెల్లించిన పన్నులు అప్పటి పంచాయతీ కార్యదర్శి యాదవపతి, బిల్ కలెక్టర్ పృథ్వీ లు పక్కదారి పట్టించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విచారణలో పంచాయతీ నిధులు 50 లక్షల వరకు స్వాహా అయినట్లు నిర్ధారించి ఈ ఇద్దరినీ సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రమేయం ఉన్న మరో కాంట్రాక్ట్ ఉద్యోగిపై కూడా వేటు వేసినట్లు డిపిఒ తెలిపారు.

బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్

సమావేశం

విశాలాంధ్ర -తిరుపతి : బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కొర్లగుంటతిరుమల బైపాస్ రోడ్డు శ్రీ ద్వారక శిరిడి సాయిబాబా మందిరం నందు అధ్యక్షులు మలకుప్పం శేఖర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో సభ్యులు ఉద్దేశించి మాట్లాడుతూ ఎంతోమందికి గృహ నిర్మాణం మనం పని చేస్తూ ఉన్న కానీ మనకు ఉండడానికి ఇల్లు లేదు నివాసం లేక రోడ్ల పైన బాడుగ ఇంట్లో జీవనం కొనసాగిస్తున్న కనుక మనకి ఇళ్ల స్థలాలు కోసం పోరాటం చేయాలని అదేవిధంగా కార్మికులకు వర్షాకాల సమయంలో పని లేక ఆకలితో అలమటిస్తుంటారు కాబట్టి వాళ్లకి ప్రభుత్వం ద్వారా భరోసా కల్పించాలని కార్మికులు సాధారణ మరణం చెందిన సాధారణ ఆంగ్ల వైఖరి ఏర్పడిన ప్రభుత్వం ద్వారా వారికి ఆదుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది కార్మికులందరూ కూడా నూతన సభ్యత్వం ప్రతి ఒక్కరు తీసుకోవాలని యూనియన్ లో నెంబర్ గా ఉండాలని కోరడం జరిగినది. అదేవిధంగా గురువారం మే డే కార్యక్రమం జరుపుకోవాలని ఈ కార్యమానికి అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మల కుప్పం శేఖర్ ఫౌండర్ తంగవేలు మేస్త్రి ఉపాధ్యక్షులు అల్లాబక్ష ప్రధాన కార్యదర్శి జె రమణ ట్రెజరర్ సుబ్రమణ్యం కార్యదర్శి జీవి రమణ వై జగన్నాథం విజయ్ కుమార్ ఎం.రమణ కృష్ణమూర్తి గుంజ శ్రీనివాసులు, రాజశేఖర్, ప్రసాద్, రమేష్ నాయుడు, గోవిందరాజులు, హరి తదితరులు పాల్గొన్నారు.

పదిలో సత్తా చాటిన స్వామి వివేకానంద

విశాలాంధ్ర – కార్వేటి నగరం : పది పరీక్షలలో కత్తె రపల్లిలోని స్వామి వివేకానంద విద్యా మందిరం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇందులో భాగంగా కే యువశ్రీ 533 మార్కులు సాధించి మొదటి టాపర్ గా నిలిచారు. డి చరణ్ కుమార్ 519 మార్కులు సాధించి రెండవ టాపర్ గా నిలిచారు. ఈ దీపిక 515 మార్కులు సాధించారు. ఆర్ యువరాజు 5 0 3 మార్కులు సాధించడం జరిగింది. వీరంతా గ్రామీణ ప్రాంతవిద్యార్థు లే. ఆ పాఠశాల హెచ్ఎం జయమూర్తి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

ఇండోనేషియా వర్సిటీతో ఎస్వీయూ అవగాహనా ఒప్పందానికి అంగీకారం

బోధన పరిశోధన అంశాల్లో పరస్పర సహకారానికి నిర్ణయం

జూలైలో బాండుంగ్ లో ఎస్వీయూ ప్రతినిధుల బృందం పర్యటన

విశాలాంధ్ర – తిరుపతి : ఇండోనేషియా లోని బాండుంగ్ లో గల ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీతో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకోవడానికి అంగీకారం కుదిరింది. బోధన, పరిశోధన రంగాల్లో ఈ రెండు విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర సహకరించుకునేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఒప్పంద అంశాలపై ఇరు యూనివర్సిటీల ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఇండోనేషియా యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ మిత్ర డి జమల్ తదితరుల బృందం ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, మాజీ రెక్టార్ ప్రొఫెసర్ సి కె జయశంకర్, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాద రాజుతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు నేతృత్వంలో జూలై నెలలో ఇండోనేషియాలో ఎస్వీ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం పర్యటించనుంది. వెళ్ళనున్న ఈ బృందంలో మాజీ రెక్టార్ ప్రొఫెసర్ సి కె జయశంకర్, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజు, ఇంటర్నేషనల్ డీన్ ప్రొఫెసర్ ఎస్ . కిషోర్ ఉన్నారు.

సత్యవేడులో జూన్ 11,12 వ తేదీల్లో గంగ జాతర

మే 28వ తేదీ గంగ జాతర తొలి చాటింపు

విశాలాంధ్ర– సత్యవేడు: సత్యవేడు పట్టణంలో జూన్ 11, 12వ తేదీల్లో గంగజాతర నిర్వహించడానికి జాతర నిర్వాహకుల కమిటీ తుది నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం స్థానిక కళ్యాణ వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు కమిటీ సమావేశం జరిగింది.ఇందులో లాయర్ గోపీనాథ్,సోమయ్య శెట్టి, ప్రసాద్,విజయ్ నాయుడు, సదమయ్య,కోదండ రెడ్డి, దిలీప్,రాజేష్,మురళి,శివ తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో గంగ జాతర నిర్వహణపై నిర్వాహకులు చర్చించారు.ఈ క్రమంలో 2025 మే 28వ తేదీన గంగ జాతరకు సంబంధించి పట్టణంలో తొలి చాటింపు వేస్తారు.జూన్ 4వ తేదీన రెండో చాటింపు ఉంటుందన్నారు.చాటింపు రోజున గంగ మిట్ట వద్ద అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున అంబళ్ల పోసి పూజలు నిర్వహిస్తారు.అలాగే అదే రోజు సదావలమ్మ అమ్మవారికి పొంగళ్ళు వండి నైవేద్యం సమర్పిస్తారు.రాత్రి కలశ ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.తదుపరి జూన్ 11,12 వ తేదీలలో బుధ,గురువారం రెండు రోజులు పాటు గంగ జాతర వైభవోత్సవంగా నిర్వహించనున్నారు.

రెవెన్యూ సదస్సులో పరిష్కారానికి నోచుకోని సమస్యలు

విశాలాంధ్ర– సత్యవేడు: టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించింది.ముఖ్యంగా భూసంబంధిత సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించిన విషయం విధితమే.ఇందులో భాగంగా సత్యవేడు మండలంలో గత ఏడాది డిసెంబర్ 8వ తేదీ నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. అప్పటి తహసిల్దారు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించి ప్రజల నుంచి వినతుల స్వీకరించారు.ప్రధానంగా భూసంబంధిత సమస్యలైన 22 ఏ, ఫ్రీఓల్డ్,ముటేషన్, విస్తీర్ణంలో తేడాలు,ఆన్లైన్ తప్పిదాలు వంటి సమస్యలపై ప్రజలు వినతులు ఇవ్వడం జరిగింది. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు సమస్యలకు సంబంధించి ప్రతి అర్జీదారులకు ఆన్లైన్ రసీదును ఇవ్వాల్సి ఉంది.కానీ ఇక్కడ నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దాదాపు 90 శాతం అర్జీదారులకు ఆన్లైన్ రసీదులు ఇచ్చిన దాఖలాలు లేవు.పైగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై ఆన్లైన్లో నమోదు అయి ఉంటే అది నేరుగా సీఎం డాష్ బోర్డుకు వెళుంది.సమస్యను కూడా తప్పనిసరిగా అధికారులు పరిష్కరించక తప్పని పరిస్థితి.కానీ ఆన్లైన్లో నమోదు కాకపోవడంతో ఇప్పటివరకు రెవిన్యూకు సంబంధించిన సమస్య ఒకటి కూడా పరిష్కరించిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు.రెవెన్యూ సదస్సులు ముగిసి నాలుగు నెలలు పూర్తవుతున్న సత్యవేడు మండలంలో ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదని పలువురు బాధితులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అధికారులకు వచ్చిన సమస్యలకు సంబంధించి మచ్చుక కొన్ని.దాసుకుప్పం పంచాయతీ చెన్నేరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన స్థలాన్ని సర్వే చేసి హద్దులు చూపాలని సంబంధిత ప్రధానోపాధ్యాయురాలు అధికారులకు వినతిచ్చారు. ఆంభాకంలో స్మశానానికి సంబంధించిన ఆక్రమణల తొలగింపు,హౌసింగ్ కాలనీలో భూకబ్జా, పొలాలకు వెళ్లే బాట ఆక్రమణలను తొలగించాలని గ్రామ సర్పంచ్ వినతి సమర్పించారు.అలాగే చిన్నఈటిపాకం గ్రామంలో చెన్నై వాసులకు గుప్పెట్లో ఉన్న 27 ఎకరాల ప్రభుత్వ భూములకు విముక్తి కలిగించాలని సంబంధిత సర్పంచ్ గోవిందస్వామి అధికారులకు వినతిచ్చారు.వెంకటరాజుల కండ్రిక వద్ద కన్నవరం మెయిన్ రోడ్లో తలెత్తిన దారి సమస్యను పరిష్కరించాలని రైతు ఏకదంతం విన్నవించారు. ఇలా అనేక రెవెన్యూ సమస్యలు కుప్పలు తెప్పలుగా అధికారులకు వినతులు అందాయి.అయితే ఇప్పటివరకు కూడా సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సదుద్దేశంతో రెవెన్యూ సదస్సులు నిర్వహించిన క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారుల వ్యవహార శైలి భిన్నంగా ఉండడం వల్ల రెవెన్యూ సదస్సుల లక్ష్యం నెరవేరడం లేదు.పైగా సత్యవేడులో జరిగిన రెవెన్యూ సదస్సులు ఒక బూటకం అన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.దీంతో పాటు రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతుల పరిష్కారంలో ఉన్నతాధికారులు చొరవ చూపకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.దీనిపై పూర్తిగా పర్యవేక్షణ లోపించడంతో రెవెన్యూ సంస్థలు మొక్కుబడిగా సాగింది అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.భూ సంబంధిత సమస్యలు ప్రజల నుంచి పుట్టగొడుగుల వచ్చిన వాటిని చిత్తశుద్ధిగా పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమవుతుంది. అందుకని రెవెన్యూ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి చారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఇంకా ఎన్ని రెవెన్యూ సదస్సులు నిర్వహించిన పరిష్కారం మాత్రం కనుచూపు మేరలో కనిపించడం లేదు.ఇప్పటికైనా దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలను తీసుకోవాలని అర్జీదారులు పలువురు కోరుతున్నారు.

బ్యాడ్మింటన్ టోర్నమెంట్

విన్నర్స్‌గా ఎన్ఎస్ఆర్ మురళీకృష్ణ, ప్రకాష్

విశాలాంధ్ర– తిరుపతి : సిమ్స్ ఉద్యోగుల సంఘం, సిమ్స్ అలీడ్ హెల్త్ పూర్వపు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో తుమ్మలగుంట న్యూ స్లిమ్ బ్యాట్మెంటన్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ లో విన్నర్స్ గా ఎన్ఎస్ఆర్ మురళీకృష్ణ, ప్రకాష్ నిలిచారు. హోరాహోరీగా జరిగిన బ్యాట్మెంటన్ పోటీలలో రన్నర్స్ గా మురళి, సురేష్ లు నిలచారు. ఈ పోటీలలో రమేష్, శ్రీకాంత్ లు మూడవ స్థానంలో గెలుపొందారు. మొట్టమొదటిసారిగా స్విమ్స్ ఉద్యోగుల సంఘం, స్విమ్స్ అల్లైడ్ హెల్త్ పూర్వపు విద్యార్థుల సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఈ టోర్నమెంట్ జరిగింది. క్రీడలను అలవర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని డిప్యూటీ డైరెక్టర్ సతీష్, సీఎంఆర్ఓ కే.వివేకానంద్ లు తెలిపారు. ఉద్యోగులలో స్నేహ పూర్వక వాతావరణం నెలకొల్పడానికి ఈ క్రీడలు ఎంతో దోహదపడతాయని వారు చెప్పారు. ఈ టోర్నమెంట్ నిర్వహణలో సిమ్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు సురేష్, రామమూర్తి, ఉపాధ్యక్షులు శివ,కోశాధికారి గోవర్ధన్ పాల్గొన్నారు. సిమ్స్ ఉద్యోగుల క్రీడలను ఫిజికల్ డైరెక్టర్ మధుబాబు పర్యవేక్షించారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి

విశాలాంధ్ర– తిరుపతి : కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రవాదుల ఘాతుకానికి మరణించిన పర్యాటకుల ఆత్మశాంతికి రెడ్డి బిజినెస్ గ్రూప్ తిరుపతి చాప్టర్ సభ్యులు మౌనం పాటించారు. ఆదివారం ఉదయం రామానుజ సర్కిల్‌లోని ఓ హోటల్‌లో తిరుపతి చాప్టర్ సమావేశమైంది. తొలుత పర్యాటకులకు నివాళులు అర్పించిన అనంతరం చాప్టర్ నాయకులు మాట్లాడారు. ఉగ్రవాదుల దుశ్చర్యపై యావత్తు భారత్ ప్రజానీకం రక్తం మరిగిపోతోందని, ప్రపంచదేశాల్లో సైతం నిరసనలు వ్యక్తమవుతున్నా ఉగ్రవాదుల ఫ్యాక్టరీగా మారిన పొరుగు దేశం మాత్రం అవాకులు చెవాకులు పేలుతూనే ఉందని విమర్శించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడానికి, పొరుగుదేశానికి కలలో కూడా ఊహించని విధంగా కేంద్రం గుణపాఠం చెప్పడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత చాప్టర్ ఉద్దేశం, లక్ష్యాలను, వ్యాపారాభివృద్ధికి సభ్యుల మధ్య పరస్పర సహకారం, పేద విద్యార్థులకు చేయూత..ఇత్యాది అంశాలపై విపులంగా మాట్లాడారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ఏనుగు శ్రీనివాసులురెడ్డి, సుమతిరెడ్డి, వినోద్‌రెడ్డి, లక్ష్మీ రాజశేఖర్, వినోద్‌కుమార్‌రెడ్డి, పోలీస్ అసోసియేషన్ నాయకులు శంకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. సమావేశంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నెల్లూరు జిల్లాల సభ్యులతోపాటు హైదరాబాద్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో రాహు-కేతు పూజలు

ఒకే రోజు రూ.1.02 కోట్లు ఆదాయం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రికార్డు స్థాయిలో రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు జరిగాయి. వివిధ సేవల ద్వారా సాయంత్రం 6గంటల వరకు ఆలయానికి రూ.1,02,62,356లు ఆదాయం వచ్చింది. రాహు-కేతు పూజల విషయానికి వస్తే రూ.500 పూజలు 4,739, రూ.750 పూజలు 2,481, రూ.1,500 పూజలు 862, రూ.2,500 పూజలు 492, రూ.5వేలు పూజలు 192... మొత్తం 8,766 పూజలు జరిగాయి. ఆలయ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు జరగడం ఇదే ప్రథమమని అధికారులు తెలిపారు. వేసవి సెలవులు కావడం... ఆదివారం అమావాస్య రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అధికారుల సమాచారం మేరకు సాయంత్రం 6గంటల వరకు 26,392మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఆదాయం కూడా ఒకే రోజులో ఇంత రావడం ఇదే ప్రథమమని అధికారులు చెప్పారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళం

విశాలాంధ్ర-తిరుపతి: చెన్నై కు చెందిన పాన్ ప్యూర్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆదివారం శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో కార్యాలయంలో అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరికి ఆ సంస్థ సీఎండీ ఎం.పొన్నుస్వామి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.పి.సూర్యప్రకాశ్ విరాళం చెక్కును అందజేశారు. ఈ విరాళాన్ని శ్రీ వెంకటేశ్వర ప్రాణదాన ట్రస్టులో భాగమైన శ్రీవేంకటేశ్వర అపన్న హృదయ పథకానికి వినియోగించాలని దాత అదనపు ఈవో ను కోరారు.

వాటంబేడులో ఘనంగా ద్రౌపదీ కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి: తడమండల పరిధిలోని వాటంబేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచపాండవ ద్రౌపతి సమేత శ్రీ ధర్మరాజు స్వామి దేవస్థానంలో ఆదివారం ఘనంగా ద్రౌపది కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఆలయ పరిసర ప్రాంతంలో భారత పఠనం చిత్ర సేన యుద్ధం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆలయం ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్రౌపది కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహోత్సవం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ద్రౌపతి అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూళ్లూరుపేట శాసనసభ్యులు నెలవల విజయశ్రీ పాల్గొన్నారు.

కూటమి రాకతో మారనున్న మత్స్యకారుల దశ

- ఎన్నికల్లో హామీ మేరకు వేట నిషేధ సమయంలో రూ. 20 వేల సాయం
- 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ది
- వైకాపా హయాంలో ఫిష్ ఆంధ్ర పేరిట కోట్లు ఖర్చు దండగ
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

విశాలాంధ్ర-పలమనేరు: కూటమి ప్రభుత్వం రాకతో మత్స్య కారుల దశ మారాతున్నదని వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి విడుదల చేయడం జరిగిందని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేర్ లోనే తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని 10వేల నుంచి 20వేలకు పెంచడం జరిగిందన్నారు. దీని వల్ల 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ. 259 కోట్ల లబ్ది చేకూరనుందని తెలియజేశారు. మత్స్యకార కుటుంబాలు టీడీపీకి అండగా నిలబడ్డాయని వెనుకబడిన వర్గాల సంక్షేమం తెలుగుదేశం ధ్యేయంగా వారి అభివృద్ధికి కోసం రాష్ట్రంలోని 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందించడం, మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో, వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీగా ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలుండగా చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందువరుసలో ఉందన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం మన రాష్ట్రం నుంచే ఉండడం 32 శాతం మత్స్య సంపద ఇక్కడి నుంచే ఎగుమతులు జరుగుతొందన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. మత్స్య కారుల సేవలో ముఖ్య మంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమని చెప్పు కొచ్చారు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 300 కోట్లు ఖర్చు చేస్తే ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా అని ప్రశ్నించారు. 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిందని వివరించారు. 2014-19 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టడమే గాక వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇచ్చిన తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇక వారి సంక్షేమం

గల్లా అరుణకుమారి రాజకీయ జీవితం నేటి రాజకీయ నాయకులకు మార్గదర్శకం

పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్

విశాలాంధ్ర-తిరుపతి: మాజీమంత్రి గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకావిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఆదివారం బెంగళూరులోని కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ మరియు ఇతర రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గల్లా అరుణకుమారిని పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ దుశ్శాలువ, పుష్ప గుచ్ఛంతో ఘనంగా సత్కరించి గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తక ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... మాజీమంత్రి గల్లా అరుణకుమారి రాజకీయ జీవితమే స్ఫూర్తిదాయకం అని తెలిపారు. ఈ పుస్తకం ఆమె జీవితంలోని అనుభవాలను, విజయాలను, సవాళ్లను వివరించే అద్భుతమైన పఠనం, ఇది ప్రత్యేకంగా యువతకి మార్గదర్శకంగా నిలుస్తుంది అని ఆయన చెప్పారు. చిత్తూరు జిల్లా అభివృద్ధి పట్ల ఆమె చూపించిన నిబద్ధతకు మరువలేనిది అని చెప్పారు. గల్లా అరుణకుమారి చిత్తూరు జిల్లాకే కాదు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణం అని చెప్పారు. అరుణకుమారి రాజకీయాల్లో ప్రవేశించి, ప్రజాసేవను జీవిత లక్ష్యంగా తీసుకున్నారని అన్నారు. బాలిక విద్యను ప్రోత్సహించడంలో ఆమె తీసుకున్న చర్యలు నేటికి చిత్తూరు జిల్లా ప్రజలు గుర్తు పెట్టుకుంటున్నారు' అని పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, టిడిపి నాయకులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా సిటీ టెర్రస్ గార్డెన్ వార్షికోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి లోని సిటీ టెర్రస్ గార్డెన్స్ (సిటీజీ) 4వ వార్షికోత్సవం ఆదివారం సరస్వతి శిశు మందిర్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్వీ యూనివ ర్సిటీ మాజీ వైస్ చాన్స్ లర్ డాక్టర్ రాళ్లపల్లి రామమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ప్రధాన ఉపన్యాసం చేసిన రిటైర్డ్ ప్రిన్సిపాల్, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం. ఎమ్ హేమంత్ కుమార్ సిటీజీ సభ్యులకు మిల్లెట్స్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. చిరు ధాన్యాలతో ఆరోగ్య రక్షణ ఎలా చేసుకోవాలో, అనారోగ్యానికి ఎలా దూరంగా ఉండగలమో అని వివరించారు. సోషియల్ అగ్రికల్చర్ ఫార్మింగ్ చేస్తున్న డాక్టర్ ఎంసీ వెంకటనాథ్ ప్రసంగించారు. బెస్ట్ గార్డెన్స్ నిర్వహిస్తున్న వారికి అవార్డులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సిటీజీ వ్యవస్థాపక సభ్యులు ప్రసన్న కుమారి, జీవిఎల్ మనోహర్, నదింపల్లి కృష్ణ, మోహన్ రావు, జి.సుధ, నాగశ్రీ, తేజోవతి కార్యక్రమం నిర్వహించారు.

రెండవ రోజూ ఆగని గజరాజుల దాడులు

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలంలోని గానుగ పెంట పరిసర ప్రాంతాలలో వరుసగా రెండవ రోజు ఏనుగులు దాడి చేసి పంటలను ధ్వంసం చేశాయి. రెండు రోజులుగా ఏనుగులు దాడులు చేస్తున్న అరికట్టాల్సిన అటవీశాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదు. శనివారం రాత్రి గానుగపెంట, ధనుజ వారి పల్లి కి చెందిన రైతులు రమేష్, గురుదేవ్, సుబ్బరత్నమ్మ, శేఖర్ లకు చెందిన పొలాలలో సాగు చేసిన వరి, కొబ్బరి, మామిడి తోటలపై దాడిచేసి వరిపంట ను నాశనం చేయడంతో పాటు కొబ్బరి, మామిడిచెట్లను నేలమట్టం చేసాయి. కష్టపడి సాగు చేసిన పంట నష్టపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఏనుగులు దాడులు చేస్తున్న అటవీశాఖ అధికారులు స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా అట్టవీశాఖ సిబ్బంది స్పందించి ఏనుగుల దాడుల నుండి తమ పంటలను కాపాడాలని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

బలిజలు అన్ని రంగాల్లో రాణించాలి

తిరుపతి-తిరుపతి: బలిజ ఉద్యోగులు, మేధావుల వందో ఆత్మీయ కలయికను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఓ ప్రైవేట్ హోటల్ లో సభాధ్యక్షులు రమణ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ కలయిలో వివిధ శాఖల్లో పని చేసే ఉద్యోగులు, మేధావులు పాల్గొన్నారు. బలిజ సామాజిక వర్గంలో ఐక్యతకు ఇటువంటి ఆత్మీయ కలయికలు ఎంతో ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా బలిజలు మరింతగా బలపడాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. సామాజికంగా, ఆర్థికంగా బలిజలు బలపడే క్రమంలో ఇతర సామాజిక వర్గాలతో సఖ్యతగా మెలగి వారి మన్ననలు పొందాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒడుదుడుకులు ఎదురైనా జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ లాగా నిలబడే ధైర్యం ఉన్న యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వూకా విజయ్ కుమార్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కోడూరు బాలసుబ్రమణ్యం, సింగంశెట్టి సుబ్బరాయుడు, దేవర మనోహర్, మెరుపుల మహేష్, హైకోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చిదంబరం, ఏపి ప్రైవేట్ డిగ్రీ కళాశాల అధ్యక్షులు రమణా జీ తదితరులు పాల్గొన్నారు.